నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 శుక్రవారం 27 డిసెంబర్ 2024
MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## ఏపీవో కినాక భీంరావుకు నివాళి



కినాక భీం రావు పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు

వాంకిడి, డిసెంబర్ 26 : వాంకిడి మండలంలోని బంబార గ్రామానికి చెందిన ఏపీవో కినాక భీంరావు గురువారం అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన పార్థివ దేహానికి ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మబొజ్జు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీవో కినాక భీంరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు. కినాక భీం రావు భద్రాచలం, ఏటూరి నాగారం ఐటీడీఏ కార్యాలయంలో ఏపీవోగా విధులు నిర్వహించారు.

## అడవుల సంరక్షణలో భాగస్వాములవ్వాలి



అధికారులతో మాట్లాడుతున్న పీసీసీఎఫ్, డీఎఫ్‌వో

కౌటాల, డిసెంబర్ 26 : అడవుల సంరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని కంపా పీసీసీఎఫ్ సువర్ణ అన్నారు. గురువారం సిర్పూర్(టీ) రేంజ్ పరిధిలోని ఇటుకలపహాడ్ గ్రామాన్ని సీఎఫ్ శాంతారాం, డీఎఫ్‌వో నీరజ్ కుమార్‌తో కలిసి సందర్శించారు. కంపా నిధులతో చేపట్టిన ప్లాంటేషన్‌ను ఆమె పరిశీలించి గ్రామస్తులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సిర్పూర్(టీ) రేంజ్ అధికారి ఇక్బాల్ హుస్సేన్ ఉన్నారు.

**జన్నారం డివిజన్‌లో పర్యటన:** దండేపల్లి, (జన్నారం), డిసెంబర్26 : అటవీ సంరక్షణను మరింత బలోపేతం చేయడానికి సిబ్బంది కృషి చేయాలని కంపా పీసీసీఎఫ్ సువర్ణ(ఐఎఫ్‌ఎస్) సూచించారు. జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని రేంజ్‌లలో గురువారం జిల్లా అటవీ అధికారి(డీఎఫ్‌వో) శివ్ అశీష్‌సింగ్‌తో కలిసి పర్యటించారు. రేంజ్ అధికారులు, డిప్యూటీ రేంజర్‌లు, ఎఫ్‌ఎస్‌వో, ఎఫ్‌బీవోలు ఉన్నారు.

# యాసంగి కష్టమే..!

- కుమ్రం భీం ప్రాజెక్టు నుంచి కానరాని నీటి విడుదల
- మరోవైపు కరెంట్ కోతలు.. ఆసక్తి చూపని రైతాంగం
- గత సీజన్‌కంటే భారీగా తగ్గిన పంటల సాగు
- ఇక వరి అయితే 9 వేల ఎకరాల్లోపే..



కుమ్రం భీం ప్రాజెక్టు కాలువల్లో పెరిగిన గడ్డి

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో కొన్నేళ్లుగా పెరుగుతూ వచ్చిన యాసంగి సాగు, ఈయేడాది తగ్గుముఖం పట్టింది. గత యాసంగి సీజన్‌లో దాదాపు 43 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేయగా, ఈ యేడాది కనీసం 40 వేల ఎకరాల్లో సాగవుతుందని యంత్రాంగం భావించింది. కానీ, 30 వేల ఎకరాల్లోపే పంటలు వేస్తున్నట్లు తెలుస్తున్నది. కేసీఆర్ సర్కారులో 24 గంటల ఉచిత విద్యుత్, సాగు నీటి వనరులతో దర్జాగా పంటలు తీసిన రైతాంగం, ఈసారి మాత్రం వెనకడుగు వేస్తున్నది. ఇప్పటికే జిల్లాలో విద్యుత్ కోతలు మొదలు కావడం.. దీనికి తోడు జిల్లాలో ప్రధాన సాగునీటి జలాశయమైన కుమ్రం భీం ప్రాజెక్టులో 10 టీఎంసీల నీటి నిల్వకు బదులుగా 5 టీఎంసీలే నీరు ఉండడం.. కాలువలు శిథిలావస్థకు చేరుకోవడం.. పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంవంటి కారణాలతో యాసంగి సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు. కనీసం కాలువల్లో ఆయిల్ ఇంజిన్లు వేసి నీటిని పెట్టుకునే అవకాశం కూడా లేదు.

### 30 శాతం తగ్గుముఖం

గత యాసంగిలో రైతులు సాగుచేసిన పంటలతో పోలిస్తే ఈ యాసంగిలో సాగు గణనీయంగా తగ్గే అవకాశాలున్నాయి. గత యాసంగిలో శనగ 7,881 ఎకరాల్లో సాగు చేయగా, ఈసారి 4,600 ఎకరాల్లో సాగు అవుతోంది. పెసర గతేడాది 2,148 ఎకరాల్లో సాగు కాగా, ఈ ఏడాది 425 ఎకరాల్లో మాత్రమే సాగు అవుతోంది. జొన్న, మొక్కజొన్న పంటలు కూడా గతేడాదితో పోలిస్తే ఈసారి సగానికి పైగా తగ్గినట్లు తెలుస్తోంది. గతేడాది సాగైన పంటలతో పోలిస్తే ఈ ఏడాది 30 శాతం వరకు సాగు తగ్గింది. ఇక గతంలో సుమారు 13 వేల ఎకరాల్లో సాగైన వరి.. ఈ యేడాది 8 నుంచి 9 వేల ఎకరాల్లో కూడా వేసే అవకాశాలు లేవు. ఇక బోర్లు ఉన్న రైతులు ఫిబ్రవరి చివరి వరకు కూడా జొన్న, మక్క టమాట, బెండ, బీరవంటివి సాగు వేస్తుంటారు. మూడు నెలల్లోనే ఈ పంటలు చేతికి వస్తాయి. అయితే.. ఈ ఏడాది విద్యుత్ కోతలు మొదలవ్వడంతో ఆ పంటల సాగుకూ వెనుకడుగు వేసినట్లు తెలుస్తోంది. గతంలో కుమ్రం భీం ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేసేవారు. కాలువల్లో పైపులు వేసి ఆయిల్ ఇంజిన్ల ద్వారా పంటలకు నీరు మళ్లించుకునేవారు. ఈసారి కాలువల ద్వారా నీటిని విడుదల చేయకపోవడంతో ఆయిల్ ఇంజిన్ల ద్వారా కూడా రైతులు నీరు పెట్టుకోలేని పరిస్థితి నెలకొంది.



కుమ్రం భీం ప్రాజెక్టు

# 108కు సుస్తీ!

- తరచూ మరమ్మతులకు వస్తున్న అంబులెన్స్‌లు
- కోటపల్లి, భీమిని మండలాల్లో కరువైన సేవలు
- చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంలో రిపేర్లు
- నెల క్రితం అట్టహాసంగా రెండింటినీ ప్రారంభించిన ఎమ్మెల్యే వివేక్
- సిబ్బంది లేక నిరుపయోగం
- అత్యవసర సమయాల్లో ఇబ్బందులు



చెన్నూర్ ప్రభుత్వ దవాఖానలో ఉన్న పాత, కొత్త అంబులెన్సులు

**ఆపత్కాలంలో ఆదుకోవాల్సిన '108'కు సుస్తీ చేసింది. పలు మండలాల్లో తరచూ మరమ్మతులకు వస్తుండగా, అత్యవసర సమయాల్లో సేవలందక ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది.**

**- మంచిర్యాల, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)**

- **కోటపల్లి మండలం బొప్పారం గ్రామానికి చెందిన రాజయ్య ఎడ్లబండిపై నుంచి పడిపోగా, కాలు విరిగింది. 108కి ఫోన్ చేయగా కోటపల్లిలో అంబులెన్స్ అందుబాటులో లేదు. భీమారం నుంచి అంబులెన్స్ రావాల్సి వచ్చింది. కోటపల్లిలో అంబులెన్స్ ఉంటే ఘటనా స్థలం నుంచి 30 నిమిషాల్లో దవాఖానకు చేరుకునే వారు. భీమారం నుంచి అంబులెన్స్ వచ్చేందుకు గంట పట్టింది. అదే ఏ తలకో బలమైన గాయమైతే పరిస్థితి చేయి దాటిపోయేది...**
- **ఇదే మండలానికి చెందిన ఓ గర్భవతి(పేరు చెప్పడానికి ఇష్టపడలేదు)కి ఈ మధ్యే పురిటి నొప్పులు వచ్చాయి. 108కు ఫోన్‌చేయగా.. 20 నిమిషాలకు వచ్చింది. కోటపల్లిలో అంబులెన్స్ లేక వేమనపల్లి నుంచి అంబులెన్స్ వచ్చేసరికి ఆలస్యమైంది. అక్కడి నుంచి దవాఖానకు వెళ్లేందుకు అరగంట పట్టింది. దీంతో దాదాపు గంట పాటు గర్భిణి నరకం చూడాల్సి వచ్చింది.**

... ఇలా ఒక్క కోటపల్లి మండలం అనే కాదు.. మంచిర్యాల జిల్లాలోని భీమిని, జైపూర్, చెన్నూర్ మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. అంబులెన్స్‌లు మరమ్మతులకు వస్తుండడంతో రోజుల తరబడి పక్కనే ఉంటున్నాయి. దీంతో అత్యవసర సేవలు సమయానికి అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భీమినిలోని అంబులెన్స్ నెల రోజులుగా మరమ్మతులకు నోచుకోక పక్కన పెట్టేశారు. ఇదే అంబులెన్స్ కన్నెపల్లి మండలానికి సైతం సేవలందించాల్సి వస్తుంది. అది రిపేర్ రావడంతో పొరుగున ఉన్న వేమనపల్లి నుంచి అంబులెన్స్ రావాల్సి వస్తుంది. ఇక జైపూర్ అంబులెన్స్‌కు సైతం రిపేర్ వచ్చి దాదాపు వారం, పది రోజులుగా పక్కనే ఉంది. మొన్నీమధ్యనే తిరిగి అందుబాటులోకి వచ్చింది. పాత అంబులెన్సులు పాడైపోవడంతో నిత్యం సమస్య ఏర్పడుతుంది. భీమిని- కన్నెపల్లి మండలాల్లో కేసు వచ్చిన టైమ్‌లో వేమనపల్లి అంబులెన్స్ కూడా ఏదైనా కేసులో ఉంటే బెల్లంపల్లి నుంచి రావాల్సి వస్తుంది. ఒకవేళ ఏదైనా పెద్ద ప్రమాదం జరిగినప్పుడు ఇలా ఆలస్యమైతే ప్రాణాలు కోల్పోవడం తప్ప చేసేదేమీ లేదంటూ స్థానికులు వాపోతున్నారు. ఒకవేళ కోటపల్లిలో ఏదైనా అత్యవసరమైతే వేమనపల్లి అంబులెన్స్.. భీమిని కేసులో ఉంటే... అప్పుడు కోటపల్లికి చెన్నూర్ లేదా భీమారం నుంచి అంబులెన్స్ రావాలి. చెన్నూర్ అంబులెన్స్ ఖాళీగా లేకపోయినా, ఆ సమయానికి అందుబాటులో లేకపోయినా భీమారం నుంచి వచ్చే దాకా ఎదురుచూడక తప్పని దుస్థితి నెలకొంది.

### నిరుపయోగంగా కొత్త అంబులెన్స్‌లు

నియోజకవర్గ కేంద్రమైన చెన్నూర్ ప్రభుత్వ దవాఖానలోని పాత అంబులెన్స్ సైతం తరచూ రిపేర్లకు వస్తున్నది. దీంతో చెన్నూర్‌లోనూ అత్యవసర సేవలకు ఇబ్బందులు తప్పడం లేదు. నెల క్రితం సీఎస్‌ఆర్ నిధులతో అట్టహాసంగా ఎమ్మెల్యే వివేక్ రెండు అంబులెన్సులను ప్రారంభించారు. అవి ప్రారంభించిన నెలరోజుల్లో అడపాదడపా బయటికి తీసి, లోపల పెట్టడం తప్ప.. ఇప్పటి వరకు ఒక్క కేసు కూడా తీసుకువచ్చింది లేదు. ఇందులో ఒకటి కోటపల్లి మండలానికి, మరొకటికి చెన్నూర్‌కని.. చెప్పారు. కానీ కోటపల్లిలో అంబులెన్స్ రిపేర్‌కు వచ్చి పదిహేను రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు కొత్త అంబులెన్స్ వెళ్లింది లేదు. ప్రారంభించి నెల రోజులవుతున్నా ఇప్పటి వరకు వాటికి కావాల్సిన సిబ్బందిని నియమించకపోవడంతో లక్షల విలువ చేసే వాహనాలు నిరుపయోగంగా మారిపోయాయి. ఇప్పటికైనా అత్యవసర సమయాల్లో ప్రజల ప్రాణాలు కాపాడే అంబులెన్స్‌ను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని నియోజకవర్గవాసులు డిమాండ్ చేస్తున్నారు. కోటపల్లి, భీమిని మండలాల్లో తరచూ అంబులెన్సులు రిపేర్లురిపేర్లు రాకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే కొత్త అంబులెన్స్‌లు సమకూర్చాలని కోరుతున్నారు.



108 అంబులెన్స్ లేని కోటపల్లి పీహెచ్‌సీ

### త్వరలో అందుబాటులోకి తెస్తాం



చెన్నూర్ దవాఖానకు సంబంధించి ప్రస్తుతం పాత అంబులెన్స్‌నే ఉపయోగించుకుంటు న్నాము. డిప్యూటేషన్ మీద మరో డ్రైవర్ రావాల్సి ఉంది. ఆయన వచ్చాక రెండు అంబులెన్సులు అందుబాటులోకి తెస్తాం. ప్రస్తుతానికి కొత్త అంబులెన్స్ ఇచ్చారు. పాత అంబులెన్స్ తరచూ రిపేరుకు వస్తున్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మరో కొత్త అంబులెన్స్ కూడా కేటాయించేందుకు కృషి చేస్తున్నాం. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అత్యవసర వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

**- డాక్టర్ సత్యనారాయణ, చెన్నూర్ దవాఖాన సూపరింటెండెంట్**

# భయపెడుతున్న బెబ్బులి

- సరిహద్దులో సంచారం
- ఆందోళనలో ప్రజలు



కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): సరిహద్దు గ్రామాల ప్రజలను బెబ్బులి భయభ్రాంతులకు గురిచేస్తోంది. సిర్పూర్ టీ- మహారాష్ట్ర సరిహద్దుల్లోనే దాదాపు గత 15 రోజులుగా తరుచుగా సంచరిస్తున్న పులి రోడ్ల పై వెళ్తు ప్రజలకు నిపిస్తుండటంతో భయాందోళన చెందుతున్నారు. దాదాపు గత 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు రైల్వేట్రాక్‌లు, రోడ్లు దాటుతూ ప్రజల కంటపడింది. తాజాగా గురువారం సిర్పూర్-టి లోని సరిహద్దు వాకిడికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మహారాష్ట్రలోని అమృతగూడా వద్ద పులి రహదారిపై సంచరిస్తూ కనిపించింది. రోడ్లపై వెళ్లే వాళ్లు వీడియోల్లో చిత్రీకరించారు. గత 15 రోజుల క్రితం సిర్పూర్-టిలోని హుడ్కిలి రైల్వేట్రాక్ దాటుతూ కనిపించింది. వారం రోజుల క్రితం కౌటాల మండలంలోని గుండాయిపేట్ వద్ద మిర్చి పంట చేళ్లలో కనిపించింది. అంతకు ముందు చీలపల్లిలో గేదెపై దాడిచేసింది. సుమారు గత 15 రోజులుగా మారాష్ట్ర- సిర్పూర్-టీ సరిహద్దులో రోడ్లు దాటుతూ.. రైల్వే ట్రాక్‌లు దాటుతూ తరుచుగా పులికనిపిస్తుండటతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఈ ప్రాంతంలో స్థావరం ఏర్పాటు చేసుకునేందుకు పులి వెతుకున్నట్లు తెలుస్తోంది. పులి ఎప్పుడు ఎక్కడి నుంచి వస్తుందోనని ఈ ప్రాంతంలోని గ్రామాల ప్రజలు, చేళ్లలో పనులు చేసుకుంటున్న రైతులు తీవ్రమైన భయాందోళనలకు గురవుతున్నారు. మహారాష్ట్రలకు- దాదాపు పదికిలోమీటర్ల పరిధిలో సుమారు పది గ్రామాల వరకు ఉన్నాయి. ఈ గ్రామాలకు ప్రజలు తరుచుగా వస్తున్న పులి సంచారం లో భయాందోళనలు చెందుతున్నారు.



ఇటీవల మాకిడి వద్ద రైల్వేట్రాక్ దాటుతున్న పులి

### అమృత్‌గూడలో రహదారిపైకి ..



అమృత్‌గూడ సమీపంలో ప్రధాన రహదారిపై కనిపించిన పులి

కౌటాల, డిసెంబర్ 26 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టీ)-మహారాష్ట్ర అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతం చంద్రపూర్ జిల్లా అమృత్‌గూడ గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపైకి గురువారం ఒక్కసారిగా పులి రావడంతో వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. కొందరు యువకులు దానిని సెల్‌ఫోన్‌లలో చిత్రీకరించారు. స్థానికులు పులి వస్తున్నట్లు ప్రచారం చేసి రైతులు, కూలీలను అలర్ట్ చేశారు. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా తడోబా టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ నుంచి పులులు నిత్యం తెలంగాణలోని కాగజ్‌నగర్ డివిజన్‌లోని అటవీ ప్రాంతంలోకి రాకపోకలు సాగిస్తున్నాయని, అటవీ సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

### కడంబా వైపు పెద్దపులి

పెంచికల్‌పేట్, డిసెంబర్ 26 : ఐదారు రోజులుగా మండలంలోని అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచారం కలకలం రేపుతూనే ఉన్నది. గురువారం ఉదయం దరోగపల్లి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో పెద్దపులి పాదముద్రలను అధికారులు గుర్తించారు. అక్కడి నుంచి కాగజ్‌నగర్ రేంజ్ పరిధిలోని కడంబా అటవీ ప్రాంతంలోకి ప్రవేశించినట్లు అధికారులు చెబుతున్నారు.

# 17వ రోజుకు సమ్మె



వెంకీ ఆసనం వేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 26 : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె 17వ రోజుకు చేరుకున్నది. గురువారం కలెక్టరేట్ ఎదుట రోడ్డును ఊడుస్తూ నిరసన తెలిపారు. టీయూటీఎఫ్ సంఘ సభ్యులు సదాశివ్, వెంకట్‌రావు, ధనరాజ్, జలపతి, మధుకర్, చంద్రయ్య, రవీందర్, శంకర్, మల్లేశం పాల్గొని మద్దతు తెలిపారు. రూ. 10 వేల సాయమందించారు. అనంతరం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ ప్రసన్న హరికృష్ణ పాల్గొని మాట్లాడారు. 15 ఏళ్లుగా సేవలందిస్తున్న వీరిని 17 రోజులుగా ధర్నా చేస్తున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వెంటనే సమగ్ర శిక్షా ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు శ్రుతికా, మోహన్, నగేశ్, సంతోశ్ ఉన్నారు.

### తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

ఓ న్యూస్ ఛానల్‌లో సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు శ్రుతికా, నగేశ్ తీవ్రంగా కోరారు. మల్లన్న వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్, సందీప్, నలంద, అరుణ, మీనా, శరణ్య, రమేశ్, సంతోశ్, సతీశ్, అనూప్, తులసీరాం ఉన్నారు.

### వెంకీ ఆసనం వేసి నిరసన

నస్పూర్, డిసెంబర్ 26 : సమస్యలను పరిష్కరించాలని కలెక్టరేట్ కార్యాలయం ముందు సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులకు గురువారం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చక్రపాణి, ప్రధాన కార్యదర్శి రాజవేణు సంఘీభావం తెలిపారు. అలాగే రూ. 10 వేల సాయం అందించారు. 17వ రోజుకు సమ్మె చేరుకోగా, ఫ్రస్టేషన్‌కు గురవుతున్న ఉద్యోగులు గురువారం వెంకీ.. ఆసనం వేసి నిరసన తెలిపారు.

# అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- శ్రీరాంపూర్ ఓసీపీపై సీఐటీయూ నిరసన

శ్రీరాంపూర్, డిసెంబర్ 26 : భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాపై సీఐటీయూ నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు గురువారం శ్రీరాంపూర్ ఓసీపీపై నస్పూర్ మండల సీఐటీయూ కన్వీనర్ కాసిపేట రాజేశం కాంట్రాక్టు కార్మికులతో కలిసి ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తుందని, వెంటనే ఆమిత్‌షా వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని, బహుజనులందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమిత్‌షాపై ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్, నాయకులు సతీశ్, సంపత్‌సంపత్, రమేశ్, సురేశ్, శ్రీనివాస్, మహేశ్ పాల్గొన్నారు.



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, కాంట్రాక్టు కార్మికులు

### నేడు అవుట్ పాసింగ్ పరేడ్

హాజీపూర్, డిసెంబర్ 26 : తొమ్మిది నెలల పాటు కఠిన శిక్షణ పొందిన కానిస్టేబుళ్ల అవుట్ పాసింగ్ పరేడ్‌ను శుక్రవారం నిర్వహించనున్నట్లు గుడిపేటలోని 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ వెంకట్రాములు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన 550 మంది కానిస్టేబుళ్లు శిక్షణ పూర్తి చేసుకొని అవుట్ పాసింగ్ పరేడ్‌కు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. ఆయుధ శిక్షణతో పాటు చట్టం, నేర పరిశోధన, ఫిజికల్ ఫిట్‌నెస్, సాంకేతిక విద్య, పరుగు పందెం, కరాటే, యోగా, మ్యాప్ రీడింగ్, వాహనాలు నడుపడం తదితర అంశాలతో పాటు మానవతా విలువలు, వ్యక్తిత్వ వికాసంలో కానిస్టేబుళ్లు పూర్తి స్థాయి నైపుణ్యాలను సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ కమార్ దీపక్ ముఖ్య అతిథిగా హాజరవుతుండగా, మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్‌తో పాటు పోలీస్, రెవెన్యూ అధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు.

### పైపులు దగ్ధం



కాలిపోతున్న పైపులు

దండేపల్లి, డిసెంబర్26 : దండేపల్లి మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకానికి వినియోగించిన గ్లాస్ రీఎన్‌ఫోర్స్(జీఆర్)పైపులు గురువారం అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన ఫైరింజన్ సకాలంలో చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చింది. దీంతో ప్రమాదం తప్పింది.

# పురుగుల బియ్యం వండేదెలా?

- పిల్లలు అనారోగ్యానికి గురైతే అధికారులదే బాధ్యత
- పెండింగ్ బిల్లులు, వేతనాలు వెంటనే చెల్లించాలి
- మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి

కాసిపేట, డిసెంబర్ 26 : పురుగుల బియ్యంతో వండేదెలాగని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం(సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి ప్రశ్నించారు. గురువారం కాసిపేట మండలం దేవాపూర్‌లో మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో పిల్లలకు వండి పెడుతున్న బియ్యం ముక్కిపోయి, పురుగులు పట్టి ఉంటున్నాయని ఆరోపించారు. భోజనం చేసే పిల్లలు అనారోగ్యానికి గురైతే అధికారులదే బాధ్యత అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు 4 నెలలుగా బిల్లులు, వేతనాలు రావడం లేదని, అప్పులు చేసి వంట చేసి పెడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే బిల్లులు, వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారంలోకి వస్తే రూ.10 వేల వేతనం, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఆ మాటే ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో గురువక్క, కనక దేవేంద్ర, కోట్నాక సాంద్రుబాయి, సాయక్క, అంకమ్మ, మణెమ్మ, కమలాబాయి, పోషక్క పాల్గొన్నారు.



కాసిపేట : మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి